క్లుప్తంగా

కరెన్సీనోట్లతో అమ్మవారికి అలంకరణ



పూజలందుకుంటున్న మహాలక్ష్మీదేవి

బొండపల్లి: మార్గశిర మాసం సందర్భంగా మండలంలోని అంబటివలస రామాలయంలో లక్ష్మీదేవి అమ్మవారికి అర్చకులు గురువారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారు మహాలక్ష్మీ దేవిగా దర్శనమిచ్చారు. అమ్మ వారిని కరెన్సీ నోట్లతో అలంకరించారు.

రైతులకు ఈకేవైసీ చేయాలి



తడిసిన వరి పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి తారకరామరావు

గంట్యాడ: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లోని రైతులందరికీ ఈకేవైసీ చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి వి.తారకరామారావు అన్నారు. రామవరం రైతు సేవా కేంద్రంలో గురువారం ఆయన తనిఖీలు చేశారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామంలో వర్షాల కు తడిసిన వరి పంటను పరిశీలించి, రైతులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఏడీ నాగభూషణం, ఏఓ శ్యామ్‌కుమార్, వీహెచ్ఓ వెంకటేష్, తదితరులు ఉన్నారు.

అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలి



పెనుబర్తి పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా అకడమిక్ మానిటరింగ్ కమిటీ

గుర్ల: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంచేలా ఉపాధ్యాయులు బోధన చేయాలని సర్వ శిక్ష అభియాన్ ఏఎస్ఓ సీహెచ్.జగన్ అన్నారు. పెనుబర్తి, కలవచర్ల ప్రాథమికోన్నత పాఠశాలలు,గుర్ల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)ను జిల్లా అకడమిక్ మానటరింగ్ కమిటీ గురువారం సందర్శించింది. పాఠశాలల్లో రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ, విద్యాబోధనపై ఉపాధ్యాయులను ఆరా తీశా రు. అసిస్టెంట్ జీసీడీఓ కె.గాయత్రి, ఎంఈఓ ఎస్. భానుప్రకాష్ పాల్గొన్నారు.

డ్రగ్స్‌తో జీవితాలు నాశనం

వేపాడ: మాదక ద్రవ్యాల వినియోగంతో జీవితాలు నాశనమవుతాయని వల్లంపూడి ఎస్ఐ బి.దేవి అన్నారు.డ్రగ్స్‌తో కలిగే అనర్థాలు, పోక్సో చట్టం, బాల్యవివాహాలు, మానవ అక్రమ రవాణా అంశాలపై బక్కునాయుడుపేట మోడల్‌స్కూల్‌లో విద్యార్థులకు గురువారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమ మాట్లాడుతూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బాలల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం చేస్తున్న కృషిని వివరించారు. చెడువ్యసనాలకు దూరంగా ఉంటూ, లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రయాణికుల భద్రతే లక్ష్యం



ఆర్టీసీ ఉద్యోగులకు సూచనలు చేస్తున్న అధికారి అప్పలనారాయణ

శృంగవరపుకోట: ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా ఆర్టీసీ ఉద్యోగులుపనిచేయాలని, అందుకు తగిన విధంగా బస్సులను సిద్ధం చేయాలని జిల్లా ప్రజారవాణాధికారి సీహెచ్. అప్పలనారాయణ చెప్పారు. స్థానిక ఆర్టీసీ డి పోలో, గ్యారేజి, డంపింగ్ యార్డు, డీజిల్ విభా గాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. సి బ్బందికి పలు సూచనలు చేశారు. మెయింట్‌నెన్స్ చేసిన బస్సులో 15కిలోమీటర్ల దూరం మె కా నిక్స్,డీఎం రమేష్‌తో కలిసి టెస్ట్ డ్రైవ్‌కు వెళ్లారు.

భూసమస్యలు పరిష్కరించేందుకే..



గుర్ల: మాట్లాడుతున్న జేసీ సేతు మాధవన్

గుర్ల: రైతుల భూసమస్యలనుపరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని జేసీ సేతు మాధవన్ అన్నారు. లవిడాంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఆయన హాజరయ్యారు. రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. తహసీల్దార్ పి.ఆదిలక్ష్మి రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు

రెవెన్యూ సదస్సుకు స్పందన కరువు

గజపతినగరం: ఎన్.జి.ఆర్.పురంలో తహసీల్దార్ బి.రత్నకుమార్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు రైతుల నుంచి స్పందన కరువైంది. రైతులు ఎవరూ సభకు హాజరు కాకపోవడంతో కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. అయితే సదస్సుకు సంబంధించి తమకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు.

రీచార్జ్ చేస్తేనే కరెంటు...!

- స్మార్ట్ మీటర్ల(ప్రీపెయిడ్) ఏర్పాటుకు సిద్ధమవుతున్న విద్యుత్ శాఖ
- ముందుగా దుకాణాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో కేటగిరీ –2 మీటర్ల స్థానంలో ఏర్పాటు
- తర్వాత విడతల వారీగా ఇళ్లకూ బిగింపు
- గజపతినగరం నియోజకవర్గంలో 400 మీటర్లు బిగించిన అధికారులు
- ఫోన్ల మాదిరిగా ఎప్పటికప్పుడు రీచార్జి తప్పనిసరి
- లేదంటే విద్యుత్ సరఫరా నిలిపివేత



మరడాంలో కిరాణా దుకాణానికి అమర్చిన స్మార్ట్ మీటర్

దత్తిరాజేరు: ముస్ముందు మీ ఇంటికి విద్యుత్ సరఫరా కావాలంటే ముందుగానే బిల్లు చెల్లించాల్సి ఉంటుంది. మొబైల్ ఫోన్‌లకు ఎలా అయితే రీచార్జ్ చేసుకుంటున్నామో అదే రీతిగా ప్రీపెయిడ్ చేయాల్సిందే. మీరు మొబైల్ ఫోన్‌లో మాట్లాడుతుండగా ఒక్కోసారి హఠాత్తుగా సర్వీసు నిలిచి పోతుంటుంది. మళ్లీ ఎవరికైనా ఫోన్ చేస్తే మీ ఫోన్‌లో తగినంత బ్యాలెన్స్ లేదని, తిరిగి సేవలు పొందేందుకు రీచార్జ్ చేసుకోండి అనే సమాధానం వినిపిస్తుంటుంది. రీచార్జ్ చేయించుకుని సర్వీసును పునరుద్ధరించుకుంటుంటాం. త్వరలో మీఇంటికి కరెంటు సరఫరా విషయంలోనూ సరిగ్గా ఇదే రీతిగా జరగనుంది.విద్యుత్ శాఖ మాన్యువల్ మీటర్లకు స్వస్తి చెప్పి స్మార్ట్ మీటర్లు (ప్రీపెయిడ్ మీటర్లు) ఏర్పాటు చేస్తోంది. తొలివిడతలో దుకాణా లు, ప్రభుత్వ కార్యాలయాలకు వీటిని ఏర్పాటు చేస్తున్నారు. మలివిడతలో ఇళ్లకు అమర్చనున్నారు. గజపతినగరం నియోజకవర్గంలో పలు దుకాణాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఇప్పటికే కేటగిరీ– 2 మీటర్ల స్థానంలో స్మార్ట్ మీటర్లను అధికారులు బిగించారు. ఈమీటర్ల ఏర్పాటుపై పేద,మధ్య తరగతి వర్గాల ప్రజల నుంచి అభ్యం తరాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం వినియోగదారులు విద్యుత్ వాడకం తర్వాత నెలకు ఒకసారి కరెంటు బిల్లును చెల్లిస్తున్నారు. బిల్లు వచ్చిన 15 రోజుల వరకు అపరాధ రుసుం లేకుండా, 15 రోజుల తర్వాత అపరాధ రుసుంతో బిల్లు చెల్లించడానికి సమయం ఉంటుంది. కానీ ప్రీపెయిడ్ మీటర్లు అమర్చిన తర్వాత ఆ వెసులుబాటు ఉండదు. ముందుగానే నగదు చెల్లించి రీచార్జ్ చేయించుకోవాల్సి ఉంటుంది. ఈ విధానం పేద, మధ్యతరగతి ప్రజలకు కాస్త ఇబ్బందిగానూ ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అవగాహన కల్పించాలి



ప్రీపెయిడ్ మీటర్లపై విద్యుత్ వినియోగదారులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలి. అవగాహన కల్పించాకే మీటర్ల ఏర్పాటు చేయాలి. లేకుంటే గ్రామీణ ప్రాంతాల్లో నిరక్షరాస్యులు ఇబ్బందులు పడే అవకాశం ఉంది. వారి మీట ర్‌కు సంబంధించి రీచార్జ్ బ్యాలెన్స్ ఎప్పుడు అయిపోతుందో తెలియకపోతే విద్యుత్ సరఫరా నిలిచిపోయా క అంధకారంలో ఉండాల్సి వస్తుంది. ఈమీటర్ల ఏర్పాటుతో గ్రామీణ ప్రాంత ప్రజలకు కొంత వరకు ఇబ్బందులే..

– రెడ్డి సింహాచలం, కె.కొత్తవలస గ్రామం, దత్తిరాజేరు మండలం

దశల వారీగా ఏర్పాటు చేస్తాం

స్మార్ట్ మీటర్ల ద్వారా వినియోగదారులు నాణ్యమైన విద్యుత్ పొందవచ్చు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నాం.కేటగిరీ–2 మీటర్లు ఉన్న చోట వీటిని ఏర్పాటు చేస్తున్నాం. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తాం. దశల వారీగా గృహాలు, వ్యాపార, పారిశ్రామిక సర్వీసులకు ఏర్పాటు చేయనున్నాం.

– వి. ఆదిత్య, విద్యుత్ శాఖ ఏఈ, దత్తిరాజేరు మండలం.

పేదలకు ఇబ్బందే...



గ్రామీణ ప్రాంతాల్లో ప్రీపెయిడ్ మీటర్ల ఏర్పాటు అంత మంచిది కాదు. పేద, మధ్య తరగతి ప్రజలు ముందుగానే రీచార్జ్ చేసుకుని కరెంట్ కొనుగోలు చేసుకోవాలంటే కష్టమే. రీచార్జ్ బ్యాలెన్స్ అయిపోగానే గ్రామాల్లో ప్రజలు ఎక్కడికి వెళ్లి తిరిగి రీచార్జ్ చేయించుకుంటారు..? పట్టణంలో మాదిరిగా అన్నీ అందుబాటులో ఉండవు కదా.? పట్టణ ప్రాంతాలకు, వాణిజ్య సముదాయాలకు, కార్యాలయాలకు ఈ మీటర్లు ఏర్పాటు చేసినా పెద్ద సమస్య ఉండదు. గ్రామీణ ప్రాంతాల్లో వీటి ఏర్పాటుపై ప్రభుత్వం పునరాలోచన చేయాలి

– మజ్జి అప్పలనాయుడు, ఎం.లింగాలవలస గ్రామం, దత్తిరాజేరు మండలం.

నియోజకవర్గంలో దాదాపు 58 వేలకు పైగా వివిధ రకాల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. తొలివిడతగా మండలానికి 300 చొప్పున ప్రీపెయిడ్ మీటర్లు వచ్చాయని విద్యుత్‌శాఖ అధికారులు చెబుతున్నారు. ఇప్పటివరకు 400 మీటర్లు బిగించినట్లు సమాచారం. త్వరలోనే అన్ని రకాల విద్యుత్ సర్వీసులకు ఈ మీటర్లను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

అపరాలకు బూస్టర్ డోస్‌గా యూరియా



వెదురువాడలో రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా వనరుల కేంద్రం ఏఓ గోవిందమ్మ

బొండపల్లి: వర్షాలకు నీటి మునిగి చనిపోయే స్థితికి చేరుకున్న అపరాల పంటలను కాపాడుకోవడానికి బూస్టర్ డోస్‌గా రైతులు యూరియాను చల్లుకోవాలని జిల్లా వనరుల కేంద్రం ఏఓ గోవిందమ్మ సూచించారు. పొలంబడి కార్యక్రమంలో భాగంగా మండలంలోని వెదురువాడ, కొత్తవలస గ్రామాల్లో గురువారం అపరాల పంటలను పరిశీలించి సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పెసర, మినప పంటలకు ఎకరానికి 15 నుంచి 25కిలోల యూరియా చల్లాలని రైతులకు చెప్పారు. అలాగే వరి కుప్పలపై ఉప్పునీటి ద్రావణాన్ని పిచికారీ చేసి ధాన్యం మొలకలు రాకుండా కాపోడుకోవాలని వివరించారు .హెచ్ఓ రాజశేఖర్, ఏఓ పి.వి.మల్లికార్జునరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గంట్యాడ: మండలంలోని రామవరం రూరల్ విద్యుత్ ఫీడర్ పరిధి గ్రామాలకు శుక్రవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు విద్యుత్‌శాఖ డీఈఈ త్రినాథరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్లను ఆనుకుని ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపట్టనున్న నేపథ్యంలో పెణసాం, చినమానాపురం, గొడియాడ, కితుబర్తి, బుడతానపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని పేర్కొన్నారు. అలాగే పి.ఎం.పాలెం 33 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతులు, విద్యుత్ లైన్లకు ఆనుకుని ఉన్న చెట్ల కొమ్మల తొలగింపుల పనులు చేపట్టనున్న నేపథ్యంలో తాటిపూడి, మదనాపురం , చినమధుపాడ గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

మాలల సింహగర్జనను విజయవంతం చేయాలి



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాలల సంఘాల నాయకులు

చీపురుపల్లి: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేకిస్తూ 2025 జనవరి 5వ తేదీన నిర్వహించనున్న మాలల సింహగర్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాలల సంఘాల ప్రతినిధులు కోరారు. రావివలస గ్రామంలో గురువారం మాలల సింహగర్జన పోస్టర్ల ఆవిష్కరణతో పాటు ఇంటింట ప్రచారం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునఃసమీక్షించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా కేంద్రంలోని గురజాడ కళాభారతి ఆవరణలో జనవరి 5న మధ్యాహ్నం 2 గంటలకు మాలల సింహగర్జన ప్రారంభం కానుందని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి నాయకులు పాల్గొంటారని, మాలలంతా తరలిరావాలని కోరారు. మాలల సంఘాల నాయకులు గంటాన అప్పారావు, మిరియాల కృష్ణారావు, బి.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

ముచ్చెమటలు పట్టిస్తున్న కరెంటు బిల్లులు

- విద్యుత్ చార్జీల పెంపుపై నేడు నిరసన



వలిరెడ్డి శ్రీనివాస నాయుడు

చీపురుపల్లి: శీతాకాలంలో సైతం వినియోగదారులను కరెంటు బిల్లులు ముచ్చెమటలు పట్టిస్తున్నాయని వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాస నాయుడు అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అధి కారంలోకి వస్తే కరెంటు చార్జీలు పెంచబోమని చెప్పిన చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయిన ఆరునెలల్లోనే వినియోగదారు లపై తీవ్రభారాన్ని మోపారని అన్నారు. విద్యుత్ చార్జీల పెంపును వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గ కేంద్రం చీపురుపల్లిలో 'పోరుబాట' పేరిట శుక్రవారం నిరసన తెలపనున్నట్లు చెప్పారు. పట్టణంలోని మెయిన్‌రోడ్‌లో వైఎస్సార్ విగ్రహం వద్ద నుంచి ర్యాలీగా బయలుదేరి ఆర్ఈసీఎస్ ప్రధాన కార్యాలయానికి చేరుకుని, అక్కడ అధికారులకు వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. పోరుబాట కార్యక్రమానికి జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ హాజరవుతున్నారని చెప్పారు. చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం, గుర్ల మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పోరాటాల ద్వారానే హక్కుల సాధన



బొండపల్లి: బొండపల్లిలో సీపీఐ జెండాను ఎగురవేస్తున్న ఆ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి అప్పారావు

బొండపల్లి: పోరాటాల ద్వారానే హక్కులను సాధించుకోగలమని నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి పురం అప్పారావు అన్నారు. సీపీఐ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక జాతీయ రహదారి–26 పక్కన పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ సీపీఐ ఆవిర్భవించి నేటికి 100 సంవత్సరాలు పూ ర్తవుతోందన్నారు. ప్రజాసమస్యలపై సీపీఐ అలుపెరగని పోరాటం చేసిందని, ముమ్ముందు మరిన్ని పోరాటాలు చేయ నుందని చెప్పారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యమాలను అణిచివేసేలా వ్యవహ రిస్తున్నాయని మండిపడ్డారు. ప్రజల సమస్యలపై కార్మికులు, ఇతర వర్గాల హక్కుల కోసం నిరసన తెలిపే అవకాశం కూడా ఇవ్వకుండా ప్రభు త్వాలు నిర్బంధం విధిస్తున్నాయన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలపై భారాలు మోపేందుకు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం సిద్ధమవుతుండడం సరికాదన్నారు.సీపీఐ మండల కార్యదర్శి మామిడి వెంకటరమణ, నాయకులు నరవ రామారావు,కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



శృంగవరపుకోట: ఎస్.కోటలో నిర్వహించిన వేడుకల్లో సీపీఐ నాయకులు

ఎస్.కోటలో సీపీఐ ఆవిర్భావ వేడుకలు

శృంగవరపుకోట: భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావ వేడుకలను స్థానిక పాతబస్టాండ్ వద్ద ఉన్న ఆ పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. సీపీఐ మండల అధ్యక్షుడు ఖండిపల్లి భీముడు, పార్టీ నాయకుడు ఎస్.శ్రీను పార్టీ జెండాను ఎగురవేశారు. ముఖ్య అతిథిగా హాజరైన పార్టీ రాష్ట కంట్రోల్ కమిషన్ చైర్మన్ పి.కామేశ్వరరావు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం రాక ముందే ఎర్రజెండా పుట్టిందన్నారు. ఎర్రజెండా వల్లే కార్మి కులు, కర్షకులకు హక్కులు, భద్రత, భరోసా దక్కాయన్నారు. పార్టీ నియోజకవర్గ కార్యదర్శి అప్పలరాజు మాట్లాడుతూ కార్మికులు అంతా ఐక్యంగా ఉంటేనే హక్కుల సాధన సాధ్యమవుతుందని చెప్పారు.

పోరుబాటకు తరలిరండి

- విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ నేడు వైఎస్సార్‌సీపీ పోరుబాటు
- అయిదేళ్లలోనూ చార్జీలు పెంచబోమని హామీ ఇచ్చిన చంద్రబాబు
- ఆరునెలలు తిరగకుండానే ప్రజలపై విద్యుత్ చార్జీల పిడుగు వేసిన కూటమి ప్రభుత్వం
- పోరుబాటకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు తరలిరావాలి: మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య



గజపతినగరం: పోరుబాట వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే అప్పలనరసయ్య,నాయకులు

గజపతినగరం: తమ కూటమి అధికారంలోకి వస్తే రానున్న అయిదేళ్లలో విద్యుత్ చార్జీలను పెంచబోమని,అవసరమైతే గతంలో పెంచిన చార్జీలను కూడా తగ్గిస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబునాయు డు హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి ఆరు నెలలు తిరగకముందే విద్యుత్ చార్జీలు భారీగా పెంచేశారని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ఆరోపించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ విద్యుత్ చార్జీల బాదుడును వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహ న్ రెడ్డి పిలుపు మేరకు పోరుబాట పేరిట నియోజకవర్గ కేంద్రంలో శుక్రవారం నిరసన తెలియజేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఉదయం 11గంటలకు గజపతినగరంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద ర్యాలీ ప్రారంభమవుతుందని, అక్కడ నుంచి విద్యుత్‌శాఖ డీఈ కార్యాలయానికి చేరుకుంటామని చెప్పారు. అక్కడ నిరసన తెలిపాక అధికారులకు వినతిపత్రం అందజేయనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లోనే విద్యుత్ చార్జీల పేరిట ప్రజలపై రూ.15,450 కోట్లు భారం మోపిందని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబునాయుడు పూర్తిగా విస్మరించారని,సంపద సృష్టిస్తానని చెప్పి, ప్రజల సంపద దోచుకుంటున్నారని ఆరోపించారు. ఏ ఒక్క పథకం అమలు చేయకుండానే ఆరునెలలు తిరగకముందే కూటమి ప్రభుత్వం రూ.85వేల కోట్లు అప్పు చేసిందని మండిపడ్డారు. అనంతరం పోరుబాట వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. జెడ్పీటీసీ గార తవుడు, వైఎస్సార్‌సీపీ గజపతినగరం మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు, సీనియర్ నేతలు బెల్లాన త్రినాథరావు,కరణం ఆదినారాయణ, కడుపుట్ల పైడిపు నాయుడు,బమ్మిడి అప్పలనాయుడు, పాండ్రంకి సూర్యప్రకాష్, సత్యారావు మాస్టారు, ఇనుమల రాజు, గేదెల జగదీశ్వరరావు, కె.సుబ్రహ్మణ్యం,కె.రామునాయుడు,శీర రమణ పాల్గొన్నారు.

విజయవంతం చేయండి..

శృంగవరపుకోట: విద్యుత్‌చార్జీల బాదుడును వ్యతిరేకిస్తూ పోరుబాట పేరిట ఎస్.కోట పట్టణంలో శుక్రవారం నిర్వహించనున్న నిరసన కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు గురువారం ఓ ప్రకట నలో కోరారు. ఉదయం 10గంటలకు ఎస్.కోట పట్టణంలో స్థానిక దేవి గుడి నుంచి రాంనగర్‌లో విద్యుత్ శాఖ కార్యాలయం వరకూ నిరసన ర్యాలీ నిర్వహించి, అనంతరం ఏఈకి వినతిపత్రం అందజేయనున్నట్లు పేర్కొన్నారు.పార్టీ నాయకులు, కార్యకర్తలు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరు కావాలని కోరారు.

గిరిజనులకు దుప్పట్ల పంపిణీ



ఎస్.కోట మండలంలోని బొడ్డవర గ్రామానికి చెందిన ఆల్తి సన్నిబాబు వర్ధంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు బొడ్డవర, బొడ్డపాడు, లక్ష్మీపురం గ్రామాల గిరిజనులకు గురువారం దుప్పట్లు పంపిణీ చేశారు. సన్నిబాబు కుటుంబ సభ్యులు ఆల్తి అప్పారావు, బుచ్చిబాబు, సన్యాసిరావు, బాబూరావు, గ్రామ పెద్దలు దేవాపురపు దేముడు, రామకృష్ణ, నాగేష్, శంకర్, అప్పా రావు, నాగరాజు, ఎం.సూర్యనారాయణ పాల్గొన్నారు. – శృంగవరపుకోట

వైభవంగా తిరుప్పావడ సేవ



మార్గశిర ఏకాదశి సందర్భంగా వేపాడలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు శ్రీనివాస్ ఆధ్వర్యంలో తిరుప్పావడ సేవ గురువారం వైభవంగా నిర్వహించారు. ఫలపుష్పాదులతో అలం కరించిన పులిహోర ప్రసాదాన్ని శ్రీవారికి నివేదన చేశారు. పంచసూక్తయుక్తంగా, స్వామిని ఆరాధించి, శతనామావళి పూజ జరిపించారు. అనంతరం భక్తులకు పులిహోర ప్రసాదాన్ని పంపిణీ చేశారు. తిరుప్పావడ సేవలో పాల్గొనేందుకు చుట్ట పక్క గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. – వేపాడ

అప్రమత్తంగా ఉండాలి



క్షయ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర టీబీ కన్సల్టెంట్ డాక్టర్ ప్రశాంత్ సూచించారు. జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా వైద్యారోగ్యశాఖ సిబ్బంది టి.భూర్జవలస లో ప్రజలకు గురువారం అవగాహన కల్పించడంతో పాటు పలువురికి కఫం పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమాన్ని దత్తిరాజేరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఆనంద్‌కుమార్‌తో కలిసి రాష్ట్ర టీబీ కన్సల్టెంట్ డాక్టర్ ప్రశాంత్ పరిశీలించి గ్రామస్తులకు పలు సూచనలు చేశారు. దగ్గు, కఫం, జ్వరం, బరువు తగ్గిపోవడం, ఆకలి మందగించడం, ఆయాసం, కఫంలో రక్తపు జీరలు కనిపించడం వంటి లక్షణాలు ఉన్నవారు పీహెచ్‌సీలకు వెళ్లి క్షయ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. వ్యాధి బారిన పడిన వ్యక్తులు భయాందోళన చెందకుండా ప్రభుత్వం సరఫరా చేసే మందులను వాడితే నయమవుతుందని అన్నారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. సర్పంచ్ మంత్రి క్రాంతికుమార్ పాల్గొన్నారు. – దత్తిరాజేరు

లోన్‌యాప్ మోసాలపై ప్రజలను అప్రమత్తం చేయాలి

- ఎస్పీ వకుల్ జిందాల్



స్టేషన్‌లో ఉన్న సీజ్ చేసిన వాహనాలను పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

గంట్యాడ: లోన్ యాప్ మోసాలపై ప్రజలను అప్రమత్తం చేయాలని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌ను గురువారం ఆయన సందర్శించా రు. స్టేషన్ పరిసరాలు, లాకప్ సెల్స్, ప్రాపర్టీ రూమ్, వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలు, రికార్డులను పరిశీలించారు. దర్యాప్తులో ఉన్న కేసులు, వివిధ న్యాయస్థానాల్లో ట్రయల్స్‌లో ఉన్న కేసులకు సంబంధించి సీడీ ఫైల్స్‌ను పరిశీలించి కేసుల దర్యాప్తు పూర్తి చేసేందుకు పోలీసు అధికారులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళా సంరక్షణ పోలీసులు, పోలీసు సిబ్బందితో మమేకమై వారికి దత్తత ఇచ్చిన గ్రామాల్లో భూతగాదాలు, గొడవలు, రాజకీయ పార్టీల వైరాలు, పాత నేరస్తులు, హిస్టరీ సీట్లు కలిగిన వ్యక్తుల పేర్లు, గంజాయి రవాణా, విక్రయాలు, వినియోగం గురించి సమాచారం సేకరించి ఉన్నతాధికారులకు అందజేయాలన్నారు. మండలంలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాల్లో హెచ్చరిక బోర్డులు, స్టాపర్స్, లైటింగ్ ఏర్పాటు చేయాలని ఎస్ఐ సాయికృష్ణకు సూచించారు. నేరాల నియంత్రణకు ఇన్‌ఫార్మర్ వ్యవస్థను మెరుగుపర్చుకోవాలన్నారు. ఆయన వెంట డీఎస్పీ శ్రీనివాసరావు, రూరల్ సీఐ బి.లక్ష్మణరావు, ఎస్బీ సీఐ లీలారావు ఉన్నారు.